దోస్త్ కటీఫ్

రమణమ్మ మధ్యాహ్నం రెండింటి వరకూ ఎదురుచూసింది రోహిణికోసం. ఆమె ముఖంలో విసుగుదల కొద్దిగా తొంగి చూసింది.

ఇంట్లో ఇంతసేపు ఏంచేస్తున్నది? తానిక్కడ మంచినీళ్ళయినా తీసుకోదని తెలిసి కూడా ఆలస్యం చేస్తే ఏమనుకోవాలి?

కాస్త వంటచేసి బల్లమీద పెట్టి, తావింత తిని, పసిపిల్లను ఆయా చేతి కిచ్చి రావటానికి ఇంతసేపు చేస్తోందేమిటి రోహిణి!

ఆమె కళ్ళమీద చేతులు పెట్టుకుని తల గోడకానిచ్చి కూర్చుని కన్నీరు కారుస్తున్నది.

హఠాత్తుగా మెత్తటి చేతులు రెండు ఆమె చేతులను ముఖం మీదినుండి తొలగించాయి.

"అత్తయ్యా! మీకు చాలా ఆలస్యమయింది ఇప్పటికే. లేవండి. నేనుదిగిన ఆటోలో ఇంటికి వెళ్ళి. స్నానంచేసి భోజనం చేయండి." తువ్వాలుతో ఆమె ముఖ మంతా తుడ్చి, చెంపలకు అతుక్కు పోయిన తలవెంట్రుకలను సరిదిద్దింది. రోహిణి ఆమెను లేవదీసే ప్రయత్నం చేసింది కాని చేతకాలేదు.

"ఏమమ్మా! రోహిణీ నన్ను విధి శిక్షిస్తూనే ఉంది. కంటి తడి ఆర కుండా చేస్తోంది. నేను బతికుండగానే ఇంట్లో అందరూ నన్ను విస్మరించారా, గంటచూడు ఎంతైనా.

"అత్తయ్యా!" అంటూ రోహిణి ఆమె ఒళ్ళో వాలిపోయింది.

ఆమె రోహిణి వైపు పిచ్చి చూపులు చూసింది. ఆ ఎర్రటి ముఖం మీద కుంకుమ బొట్టు జ్వాలలా మండుతోంది.

ప్రాణం ఉండీ, జీవం లేనట్టుగా మంచంమీద పడిఉన్న సాంబుకు తను కన్న తల్లి. రోహిణి చేసుకున్న భార్య. తా నతడిని కనీ పెంచి పెద్దవాడిని చేసింది. అతడి చదువూ, ఉద్యోగం, చూసింది. బిడ్డ తండ్రిగా దీవించింది. కాని—రోహిణి ఏం చూసింది. ఏ మనుభవించింది. ఇంటి కోడలిగా గడపలో అడుగు పెడుతూనే తొమ్మిది నెలలుమోసి కనకపోయినా కన్నట్టుగానే మూడు నెలల పసిపాపను గుండెకు హత్తుకుని పెంచడం మొదలుపెట్టింది. ఇరవై ఏళ్ళ రోహిణి జీవితం ఎట్లా గడుస్తుంది

ఆమె కళ్ళు చెరువులయ్యాయి—కాని వెంటనే నిగ్రహించుకొని రోహిణి దీనవదనం చూసి. కళ్ళూ, ముఖం తుడుచుకొని "మామగారు భోజనం చేశారా రోహిణీ" ఆమె తల నిమురుతూ అడిగింది.

"లేదత్తయ్యా, ఇవాళ ఇంతవరకూ కాఫీ కూడా తీసుకోలేదు. పాచిముఖం కడగలేదు"

"అయ్యో" ఆమె త్రుళ్ళిపడి లేచింది. "మనం కళ్ళతో చూస్తున్నాం. కనుక కొంత తృప్తిగా ఉంది. సాంబు పరిస్థితిని కంటితో చూడలేరు. కనుక హాల్లో ఆ పడక కుర్చీలోనే కూర్చుని కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నారు. ఆయన పడు తున్న బాధ చూడలేకుండా ఉన్నాం. అందుకే ఇంత ఆలస్యమయిందా రోహిణి! నేను ఇంటికి వెళ్ళి సాయంత్రం వస్తాను జాగ్రత్త" జ్యోతుల్లా ఉన్న కళ్ళను కొంగుతో తుడుచుకుని గది తలుపు దాటి మెట్ల దగ్గరికి వచ్చింది.

డాక్టరు మారుతీ రావు మెట్లెక్కి పైకి వస్తూంటే పక్కకు జరిగింది.

ఆయన పైకి రాగానే "మెట్లెక్కి వస్తున్నారు లిఫ్టు పాడయిందా డాక్టరు గారూ! నేను పేయింగ్ రూము నెంబరు గదిలో ఉన్న పేషెంటు తల్లిని. ఎలా ఉంది బాబూ మా నాయన పరిస్థితి?" అడిగింది.

ప్రతి రోజూ ఆమె మెట్లు దిగే వేళ డాక్టరు మారుతీ రావు మెట్లెక్కి పైకి వచ్చే వేళ అదే. ఆమె చేతులు జోడించి ఆయనను ప్రశ్నించే వేళకూడా అదే.

చిత్రంగా ఇద్దరికి ఈ వేళ ఆలస్యమే అయింది.

"ఇవేళ నేనింకా రిపోర్టు చూడలేదు. చూసి చెప్తాలెండి. ఇంటికి వెళు తున్నట్టున్నారుగా వెళ్ళరండి" గబగబా ఆమెను దాటుకుంటూ వెళ్లాడు.

నిలువుగా కూలిపోయినట్టు ఆమె దీర్ఘంగా నిట్టూర్చింది.

అది మూడవ అంతస్తు. మెట్లన్నీ దిగి చుట్టూ తిరిగిపోయి గేటుదాటి ఆటో ఎక్కి ఇల్లు చేరాలి.

ఇలా మిణుకుమిణుకు మనే ఆశను డాక్టర్ల వూరడింపుమాటలతో చిగురింప జేసుకుంటూ, రెండు సంవత్సరాలుగా ఉస్మానియా హాస్పిటల్‌కూ రామంతపురానికీ తిరుగుతున్నది రమణమ్మ. సాయంత్రం ఆరు గంటలకు ఉస్మానియా హాస్పిటల్‌కు ఆటోలో వెడుతుంది. తిరిగి మరునాడు కోడలు రోహిణి దిగిన ఆటో ఎక్కుతుంది.

ఒక్క పూటయినా నాగా లేకుండా ఆమె దిగటం, ఈమె ఎక్కటం జరుగుతోంది.

ఆ గదిలో గోడకు ఆవించి ఉన్న సోఫా మీద కూర్చుని, కిటికీ గుండా కిందికి చూస్తోంది రోహిణి. ఎటుచూచినా పూల తోట, పచ్చని లాను. దాని చుట్టూ రంగు రంగుల పూల చెట్లు. ఈ తోట అందాన్ని రోగులంతా చూడగలిగితే;

అది ఎంత పెద్ద హాస్పిటల్. ఎన్ని శాఖలు, ఎన్ని లిఫ్టులు? ఆపెద్ద హాల్లో అసఫ్ జాహి వంశీయుల ఫోటోలు ఎంతెంత పెద్దవి? హైదరాబాదు నగరంలో మీర్ ఉస్మానలీ ఖాను తన పేరు మీద యూనివర్శిటీ ఒకటి, హాస్పిటల్ ఒకటి నిర్మించి తమ పేరు నిత్యం అందరూ స్మరించుకునేటట్లు చేశాడు.

ఎప్పుడు చూసినా ఆ హాస్పిటల్లో దారి తప్పకుండా అనుకున్న చోటికి వెళ్ళే వాళ్ళు అరుదు.

రోహిణి గది దాటి బయటికి వచ్చి కారిడార్ పొడుగునా నడిచి మళ్ళీ గదికి చేరుకుంది.

ఒక్కొక్క గదిలో ఒక్కొక్క రకమైన బాధ. డాక్టరు తీర్చగలిగినవి కొన్ని—తీర్చలేనివి కొన్ని—మొండి పడినవి కొన్ని.

అప్పుడే చీకట్లు ఆవరించుకుంటున్నాయి. చెట్ల మీది పక్షులు రెక్కలు టప టప లాడించుకుంటూ విపరీతంగా అరుస్తున్నాయి. దీపాలు వెలిగాయి. రోగులను చూడటానికి వచ్చే విజిటరులు గుంపులు గుంపులుగా ఇళ్ళకు బయలుదేరుతున్నారు.

వాచ్‌మన్ గంట వాయించుతూ అందరినీ వెళ్ళమని హెచ్చరిస్తున్నాడు.

మరి కాసేపటికి రోగులు ఎవరి మంచం మీద వారు పడుకుంటారు, బిక్కు—బిక్కు మంటూ. తమ ఆత్మీయులు చెప్పిన ధైర్యం జారటం మొదలు పెడుతుంది. బ్రెడ్ తింటారు. పాలు తాగుతారు. నర్సులు గొంతులో పోసిన మందులు మింగుతారు

అయ్యో! అత్తగారింకా రాలేదు. పిల్ల ఏడ్చిందో ? మామగారు దుఃఖ పడుతున్నారో ?

రోహిణి గదిలోకి వచ్చింది. స్విచ్ నొక్కింది. లైటు వెలిగింది. ఆమె ఆ గదిలోనే ఉంటుంది. ఆ మంచం వైపు చూడాలని ఉన్నా చూడదు. హఠాత్తుగా ఎప్పుడైనా దృష్టి ఆ మంచం మీద ఉన్న రోగి మీదికి పోయినట్లయితే మరి—అక్కడి నుంచి కదలిరాదు.

కడుపులో దుఃఖం అలలు అలలుగా పైకి లేచి ముల్లోకాలనూ ముంచేటంత ఉధృతంగా పొంగుతుంది.

ఆ మంచం మీద తెల్లటి దుప్పటి కప్పుకొని పడుకున్నది సాంబు. మల్లెలతో పోటిపడే ధవళచ్ఛాయ. నల్లటి కురులు, కృష్ణ వేణమ్మ అలలు మాదిరిగా ఒంపులు దిరిగి మెడవరకూ దిగుతాయి. అతడు కళ్ళు తెరవడు తెరచి ఉంచే అవి నవ్వుతూ కవ్విస్తూ ఉండే విశాల నయనాలు. వంపులు తిరిగిన అతడి పెదవులు కదిలితే అరవిరి మొగ్గలా ఉంటాయి. ఆ గులాబీ రంగు పెదవులు విచ్చుకుంటే తెల్లటి పలువరున తొంగి చూస్తూ ఉంటుంది.

కాని—కాని అతడు కళ్ళు తెరవడు. పెదవులు కదలించడు. పలువరుసను కనబడనీయడు.

అతడు జీవించే ఉన్నాడు. గుండె కొట్టుకుంటూనే ఉంది. శ్వాసకోశాలు పనిచేస్తున్నాయి. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు క్రమబద్ధంగా ఉన్నాయి.

కాని—అతడి మిగతా అవయవాలు వాటి వాటి ధర్మాలను సహజంగా వాటంతట అవి నిర్వర్తించలేవు. అవి ట్యూబుల సహాయంతో పనిచేస్తాయి.

ఆ అవయవాలకు ఆజ్ఞలు ఇచ్చే మెదడు పనిచేయటం లేదు. అది ఏక్సి డెంటులో పెద్ద దెబ్బతిన్నది.

రెండు సంవత్సరాలు కావచ్చింది. కాని రోహిణికి అప్పుడు జరిగినట్టుగా ఉంటుంది

*   *   *   *

ఉగాది పండుగ వస్తూంది. రేపు లేదు ఎల్లుండే పండుగ. ఆఫీసునుంచి ఇంటికి వస్తూనే "రోహిణి! జీతం వచ్చింది. నీకో మంచి చీరె చూసి వచ్చాను. నాకు త్వరగా కాఫీ ఇచ్చి తయారుగా. చీరె కొని, అలా అలా టాంక్‌బండ్ మీద చల్ల గాలికి కాసేపు కూర్చుని వద్దాం ఎన్నాళ్ళయిందో మనిద్దరం స్కూటరుమీద బయటికి వెళ్ళి?" అన్నాడు ఉత్సాహంతో.

నిజానికి ఎన్నాళ్ళో కాలేదు. అసలు ఆమెతో అతడికి వివాహమయి ఆరు నెలలే అయింది.

ఆమె గబగబా కాఫీ టిఫిన్ ఇచ్చింది. ఎవరూ లేరు కదా అని అతడు అటూ ఇటూ చూస్తూ ఆమె నోటి కందించిన పకోడీలను అమృతప్రాయంగా నమిలింది. అత్తగారి చేతికి పిల్ల నిచ్చి ఇద్దరూ స్వర్గంలో విహరించినట్టు విహ రిద్దామని బయలుదేరారు.

లిబర్టీ దగ్గిర దిగి అతడికి నచ్చిన చీరె, రవిక బట్ట కొని, నూటఏభై రూపాయల బిల్లు చెల్లించారు. ఇక లిబర్టీ మీదుగా టాంక్‌బండ్ మీద కాసేపు కూర్చుందామని బయల్దేరారు. స్కూటరు స్పీదుగా బయలుదేరింది. పక పక నవ్వుతూ ఆమె ఏదో అంటోంది. అతడు జవాబుగా నవ్వుతూ ఆమెకు సమాధాన మిస్తున్నాడు. ఏ వాహనమూ రోడ్డుమీద లేనట్టుగా అతడు వూహించుకుని తన ప్రజ్ఞనంతా భార్యకు చూపిస్తూ స్కూటరు నడుపుతున్నాడు.

నల్లటి ఎంబాసడర్ రంయిమంటూ వస్తూంది. సాంబు ఇంకా జోరుగా పోతున్నాడు. ఎంబాసిడరు స్పీదు హెచ్చించింది.

అంతే.

ఎంబాసిడర్ స్కూటర్ని నెట్టుకుంటూ దూసుకుపోయింది.

రోడ్డు మీద ఒక మూల రోహిణి, మరొక మూల సాంబు పడిపోయారు. రోడ్డుకు మధ్యగా స్కూటర్, నడిరోడ్డు మీద నెమరు వేస్తూ రాకపోకల రద్దీని గమనించకుండా హాయిగా పడుకునే పెయ్యదూడలా పడి ఉంది.

రోహిణి దోక్కు పోయిన చోట చీరె కొంగుతో తుడుచుకుంటూ సాంబు కోసం వెతుకుతోంది.

ఏదీ? ఎక్కడున్నాడు?

ఫుట్‌పాత్ దగ్గిర పడి ఉన్నాడు. ఎక్కడా దెబ్బ తగిలినట్టే లేదు. కాని ఒంటి మీద స్పృహలేదు. వెల్లకిలా పడున్నాడు.

రోహిణి సాంబు దగ్గిర కొచ్చేసరికే చుట్టూ జనం మూగారు, పోలీసు వాను వచ్చింది.

చుట్టూ చేరిన వాళ్ళలో ఒకరిని పిలిచి ఇంటికి కబురు చేసింది రోహిణి. సాంబుతో పోలీసు వానులో హాస్పిటల్‌కు వెళ్ళింది.

తల్లీ తండ్రి వచ్చారు. తలలు బాదుకుని ఏడిచారు. పెద్ద డాక్టరు వచ్చారు. న్యూరో సర్జన్లు వచ్చారు. అన్ని పరీక్షలూ చేశారు. అతడిని మంచంమీద పడుకో పెట్టి ట్యూబులు తగిలించారు.

వైద్యం చక్కగా జరుగుతోంది. ఉపచారం క్రమబద్ధంగా జరుగుతూంది.

సాంబు కన్ను తెరిచి చూడడు.

నోరు తెరిచి 'అమ్మా' అనడు.

అందరికీ ఆశ. ఎప్పుడో అతడు కన్ను తెరుస్తాడనీ, పెదవి విప్పి అమ్మా అంటాడ నీను.

కాని అతనిలో చలనం లేదు.

"డాక్టరుగారూ! నా బిడ్డ బతుకుతాడా?" గుండెలను చీల్చుకుంటూ వస్తుందా స్వరం.

"అమ్మా! తొందర పడకండి. ప్రాణం ఉంది, ఎప్పుడో కదలికవస్తుంది."

ఆ క్షణం కోసం చకోరపక్షుల మాదిరిగా ఎదురు చూసి ప్రాణాలు కడబట్టి పోతున్నాయి.

డాక్టర్లు. స్పెషలిస్టులు చిన్నా పెద్దా వస్తున్నారు. చర్చించుకుంటున్నారు. ఆశాభావంతో వేళప్రకారం వచ్చి చూస్తున్నారు.

సాయంత్రపు వేళ నీరెండ చెట్లమీద పడి ప్రకృతికి వింతసోయగాన్నిస్తున్న వేళ హాస్పిటల్లో విజిటర్సు సందడి అధికంగా ఉన్న వేళ రమణమ్మ గదిలోకి వచ్చింది. రోహిణి ఇంటికి వెళ్ళటానికి సిద్ధమవుతున్నది.

ఇద్దరి ముఖాలూ ఉబ్బరించి ఉన్నాయి. ఒకరి నొకరు పలకరించుకోలేదు. కళ్ళెత్తి ముఖాలలోకి చూసుకున్నారు. వెంటనే దించుకున్నారు.

అదే సమయంలో సరదా పైకెత్తిపట్టుకుని హాస్పిటల్ సూపర్నెంటు గదిలో కాలు పెట్టాడు.

ఇద్దరూ ఆయనకు నమస్కరించారు.

"ఇంటికి వెళ్ళుతున్నారా?" పలకరించినట్టుగా అడిగాడు.

"కోడలు వెళుతుంది. నేనిక్కడ రాత్రిళ్ళు ఉంటాను. ఇంట్లో పని ఎక్కువగా ఉంటే ఆనాడు నేను ఇంట్లోనే ఉంటాను."

"అలాగా? అయ్యో! నిలబడే ఉన్నారు. ఇలా కూర్చోండి."

వాళ్ళు చూస్తుండగా ఆయన ఆ గదిలోకి మూడు నాలుగు సార్లు వచ్చాడు. కాని ఇంత ఆప్యాయంగా పలకరించలేదు. విస్మయంతో ఇద్దరూ సోఫా మీద కూర్చున్నారు. ఇద్దరి హృదయాలలో ఆశలు రేకెత్తుతున్నాయి. రేపు ఎల్లుండిలో సాంబులో ఏమయినా మార్పు వస్తుందేమో? ఇతడు ఆ శుభ వర్తమానం చెప్ప డానికి వచ్చాడేమో? అంతలో వారిద్దరి ముఖాలూ ప్రఫుల్లమయ్యాయి.

"అమ్మా! మీరిద్దరూ ఉండగా ఒక మాట చెప్పాలని నిన్నటి నుంచీ చూస్తున్నాను. నేను చెప్పేది జాగ్రత్తగా వినండి. నన్ను అపార్థం చేసుకోకండి.

ఇతడికి స్పృహ వచ్చే ఆశలు కనపడటం లేదు. ఇలా ఎన్నాళ్ళుంటాడో చెప్ప లేము. ఇప్పటివరకూ ఇతడి అవయవాలు ఆరోగ్యంగా ఉన్నాయి. ముందు ముందు చెడిపోవచ్చు. అందువల్ల ఇతడి కళ్ళు, మూత్రపిండాలు, గుండె తీసి భద్రపరిచి అవసరమైన వాళ్ళకు ఉపయోగిస్తారు. ఇవి చెడిపోయిన వాళ్ళెందరో ప్రాణాన శిష్టంగా పడి ఉన్నారిక్కడ. ఇందుకు మీరు అనుమతివ్వాలి." మెల్లగా ఒక్కొక్క మాటే వాళ్ళ ముఖాలు చూస్తూ అన్నాడు సూపర్నెంటు.

ఆ మాటలకు ఇద్దరూ హతాశులయ్యారు పంచ ప్రాణాలూ పైకెగిసిపోయి నట్లయింది. రోహిణి మోకాళ్ళ మీద తల పెట్టుకుని వెక్కిళ్ళుపడేట్లు రోదించటం మొదలుపెట్టింది.

"డాక్టరుగారూ! నా నాయన ఇంక లేవడా? కళ్ళు తెరిచి చూడలేడా? అమ్మా అని నన్ను పిలవడా? ఈ జన్మ కింతేనా డాక్టరుగారూ?" గండిపడిన చెరువులా అయ్యాయి ఆమె కళ్ళు.

"అమ్మా! ఇలా చూడండి. మనకు పనికిరాని వస్తువులతో ఇతరుల ప్రాణాలు నిలుస్తాయంటే సంతోషించదగిన విషయం కాదమ్మా? మీ బిడ్డనువాళ్ళల్లో చూసుకోవచ్చు. మీరు వాళ్ళకు ప్రాణదానం చేసిన వాళ్ళవుతారు కదా? బాగా ఆలోచించండి."

"నా కడుపున చిచ్చుపెట్టుకుని ఎవరిలోనో నా కొడుకును చూసుకోగలనా, డాక్టరుగారూ?"

"మీరు చూసుకోగలరు. మాతృహృదయం విశ్వమంత విశాలమయింది. మీరు మీ కొడుకు దేహంలో ఉన్న కొన్ని అవయవాలతో కొందరు బతుకుతారనుకోండి. వాళ్ళు మీ కుమారులు కారా? బాగా ఆలోచించుకోండి. నిదానంగా నాకు చెప్పండి" అతడు కుర్చీలోంచి లేవబోయాడు

దిగ్గున లేచింది రోహిణి.

ఆమె లేచే తీరూ, ఆమె కళ్ళూ, ముఖం ఉన్న విధం చూసి సూపర్నెంటు ఒకడుగు వెనక్కి వేశాడు జంకుతో.

"డాక్టరుగారూ! ఆయన దేహంలో నుంచి నేను గోరంత భాగమయినా ఇవ్వను. ఆయన దేహాన్ని తాకనివ్వను. ఆయనకు ప్రాణం ఉండగా, నేను చూస్తూ ఉండగా ఇంత ఘోరం జరగటానికి వీలులేదు. ఆయన దేహం మీద ఈగయినా వాలడానికి వీలులేదు" రోహిణి ఆవేశంతో అరిచింది,

"రోహిణిని" రమణమ్మ ఆమె చేతులూ రెండూ పట్టుకుంది "మన మేమి చేసుకుందామా ప్రాణిని? కదలడు మెదలడు కళ్ళు తెరవడు నోరు విప్పడు. సాంబును అట్లా ఏళ్ళ తరబడి చూస్తూ ఏడవటమే కాని మనకేమయినా సుఖమా తల్లీ? అల్లా జీవచ్ఛవంలా ఉంటే చూడ గలుగుతున్నావా? రోహిణీ! లాభం లేదమ్మా. డాక్టరుగారు చెప్పినట్లు మనకు పనికి రాకపోయినా మరొకరికి ఉపయోగ పడి ప్రాణం పోసుకుంటుందంటే ఆ దానంవల్ల ఎంతటి పుణ్యం వస్తుందో బాగా ఆలోచించి చూడు తల్లీ." కళ్ళ నీళ్ళు కారిపోతున్నా రమణమ్మ మాతృ హృదయం విలవిల్లాడి పోతున్నా డాక్టరుగారి మాటల్లోని అర్థాన్ని గ్రహించింది.

"లేదు. నాకీ పుణ్యకార్యాలపట్ల నమ్మకం లేదు. నన్ను ప్రేమించిన హృదయాన్ని, నన్ను లాలించి నవ్వించిన ఆ విశాల నయనాలను నే నీవిధంగా నయినా చూసుకుని బతుకుతున్నాను. నా ఆశలు చంపకండి. నన్నీవిధంగానయినా బతకనీయండి." అరిచి అరిచి పడిపోయింది రోహిణి.

రమణమ్మ కోడల్ని చూచి అదిరిపోయింది.

"అమ్మ. మీ అనుజ్ఞలేనిదే కాలి గోటినయినా మేము తియ్యం. ఆలో చించుకోండి. రేపు నేను మళ్ళీ వస్తాను" సూపర్నెంటు లేచి వెళ్ళాడు.

రోహిణి అపస్మారకంలో పడి ఉంది. ఏదేదో అవ్యక్తాలాపన చేస్తున్నది

ఆ తల్లికి కాళ్ళూ చేతులూ ఆడటంలేదు.

డాక్టరు రోహిణి ముందు ఈ ప్రస్తావన తీసుకురాకుండా ఉండవలసింది.

అవును. రోహిణి మాట నిజమే. తన కింకో కొడుకున్నాడు. మరి రోహిణికి?

ఈ రోహిణీ—సాంబులు చిన్ననాటి నేస్తాలు. చిన్నప్పటినుంచీ ఒకటిగా తిరిగేవారు ఆడుకునేవాళ్ళు. సాంబు రోహిణిని ఏడిపించాలని ఆమె వెంట

పరుగెత్తి. చెవులు మెలిపెట్టి "ఇప్పటి నుండీ నీ దోస్త్ కటీఫ్" అనేవాడు. కాని ఆమె కన్నీళ్ళుచూసి అయిదు నిమిషాలలోపలే వచ్చి, భుజమ్మీద చెయ్యేసి"దోస్త్" అంటూ తన కుడిచేతి బొటనవేలిని ఆమె బొటనవేలికి బలవంతంగా తాకించేవాడు. అటువంటి స్నేహం ప్రేమగా రూపొందింది. పెళ్ళి మాటల కొచ్చేసరికి సాంబు తండ్రి పది వేలడిగాడు.

రోహిణి తండ్రి వెయ్యి రూపాయల జీతగాడే. కాని నలుగురు ఆడపిల్లల తండ్రి. ఇంతగా ప్రేమించుకున్న పిల్లలను డబ్బు విడదీస్తుందా అనుకున్నాడు

కాని విడదీసింది.

డబ్బు సంచులతో వచ్చిన వనజ రెండు సంవత్సరాలే ఉంది. పది రోజుల బాలింత అనుకోకుండా బిడ్డను తల్లి లేని దాన్ని చేసి వెళ్ళిపోయింది.

రోహిణి ఇదంతా చూస్తూనే ఉంది. తనను చేసుకోలేదని ఆమె సాంబు మీద కోపగించలేదు. సాంబు పట్ల ఆమె ప్రేమ పున్నమి నాటి వెన్నెలలా ఇంకా విరియ కాస్తూనే ఉంది. అతడు మరొకరి వాడవుతేనేం తను ప్రేమించడానికి? ప్రేమించటానికి పెళ్ళే కావాలా? శారీరకమయిన ఆనందమే కావాలా? ఏ పని చేస్తే అతడి కిష్టమో ఏ పని చేస్తే అతడికి సహకరించినట్లవుతుందో ఆ పని చేసి తాను సంతోషించకూడదా? ఇది ఏకపక్షమే అయినా ఆమె ప్రేమకు ప్రతిబంధకం కాలేదు.

వనజ చనిపోయిననాడు అందరూ తలలు పట్టుకుని కూర్చుంటే. ఏడ్చి గుక్కలు పెట్టే పసిబిడ్డను మేడ దిగి వచ్చి అక్కున చేర్చుకున్నది రోహిణి.

సాంబు అన్నోదకాలు విసర్జించి దిగాలుపడి కూర్చున్నాడు. నెల గడిచినా అతడు పెరిగిన గడ్డాన్ని గియ్యలేదు.

సాంబు తిరిగి ప్రపంచంలో పడాలంటే అతడికి తిరిగి పెళ్ళి చెయ్యాలని తల్లి దండ్రులు ఆలోచిస్తున్నారు మూడో నెల వచ్చేసరికి ఈ వార్త పైకి బుస్సున పొంగింది.

రోహిణికి కూడా ఈ వార్త తెలిసింది.

చీకట్లో గదిలో మంచం మీద వెల్లకిలా పడుకుని కప్పుకేసి చూస్తున్న. సాంబు గదిలోకి వెళ్ళింది రోహిణి

అడుగుల చప్పుడు విని లేచి లైట్లు వేశాడు.

ఆమెను చూడగానే బొమ్మలా నిలబడ్డాడు.

ఆమె తన పెళ్ళయిన తరువాత కంటబడలేదు. భార్యపోయిననాడు ఎక్కడి నుంచి వచ్చిందో వచ్చి, ఏడుస్తున్న పిల్లలను అక్కున చేర్చుకుంది. ఆమె మళ్ళీ కనపడలేదు. ఆమెతో మాట్లాడి ఎన్నాళ్ళయింది?

ఆమెను పలకరించడానికే అ౦డికి ముఖం చెల్లటంలేదు. ఏదో అపరాధం చేసినట్టుగా గుండె కొట్టుకుంటోంది. తల భూమిలోకి దిగిపోతోంది.

"సాంబూ."

"కూర్చో రోహిణి" దగ్గరగా ఉన్న కుర్చీ ఆమె నిలబడి ఉన్న వైపుకు జరిపాడు.

"నీవు మళ్ళీ పెళ్ళి చేసుకుంటావని తెలిసింది. నీ ప్రేమ చిహ్నంగా నీ వస్తు వేదయినా నా దగ్గిర ఉండాలి. ఆ పాపను నా కిస్తావా—పెంచుతాను." అడిగింది. గాఢంగా ప్రేమించుకున్నప్పటికీ డబ్బుకోసం వేరే పెళ్ళి చేసుకున్న సాంబు ఆప్యాయంగా "రోహిణి! ఈ గుండెబలం లేనివాడితో ఇంకా మాట్లాలని పిస్తోందా? నేను పిరికివాడిని. సిగ్గుతో తల వంచుకుంటున్నాను."

"సాంబూ! నీవు ధైర్యంతో నన్ను పెళ్ళి చేసుకోలేకపోయావు. కాని నీ మనసు నిండా నేనే ఉన్నాను. కాని చెప్పగలవా? చెప్పలేవు అందుకని నీ ప్రేమ చిహ్నంగా పాపను పెంచుతాను. పాపలో నిన్ను చూసుకుంటాను తల్లా పెద్దదయింది. రాబోయే నీ భార్య నీ పాపను ప్రేమతో పెంచలేదు."

"అందుకూడా నాకు ముఖం చెల్లటం లేదు రోహిణి."

ఆ గది పక్కగా వంట ఇంట్లోకి వెళ్ళుతున్న రమణమ్మ వాళ్ళ సంభాషణ పూర్తిగా విన్నది. ఆ మాటలు ఆమె గుండెలో గునపంలా గుచ్చుకున్నాయి. గది

లోకి నడిచింది వాళ్ళిద్దరి ముఖాలూ చూసింది. రోహిణికి జరిగిన అన్యాయాన్ని జ్ఞాపకం తెచ్చుకుంది. గుండె నీరయింది.

చప్పున రోహిణి రెండు చేతులూ పట్టుకుంది. గుండె కావించుకుంది

"అమ్మా! రోహిణీ! నీ కొకసారి అన్యాయం చేసి నష్టపోయాము. ఈసారి నీ కన్యాయం చేయలేనమ్మా, ఈ బిడ్డే కాదు. సాంబూ నీ వాడే. ఈ ఇల్లు నీది రేపటి నుంచీ నిర్వహించుకో తల్లీ" ఆమెను గుండెకు చేర్చుకుంది.

* * * *

అచేతనంగా పడి ఉన్న రోహిణిని చూడగానే రోహిణి-సాంబుల పెళ్ళి ప్రస్తావనలు మనసులో మెదిలాయి రమణమ్మకు. కన్నార్పకుండా వెర్రి ప్రేమతో బతుకుతున్న రోహిణి వంకే చూస్తోంది రమణమ్మ.

రాత్రి వేళ నిశ్శబ్దంగా ఉన్న ఆ హాస్పిటల్లో అక్కడక్కడ చప్పుళ్ళూ మాటలూ నెమ్మదిగా వినిపిస్తున్నాయి. వేకువ జామున నైట్ డ్యూటీ నర్సు అందరికీ టెంపరేచరు చూడటానికి నాలుగు గంటలకే బయలుదేరింది. తనవార్డులో కింద అంతస్తులో అందరికీ చూసి పైకి వచ్చింది.

రమణమ్మ, రోహిణులు సోఫా మీద కూర్చుని ఉన్నారు.

"ఏవమ్మా, నిద్రపోలేదా?" అంటూ వెళ్ళి సాంబు టెంపరేచరు చూచింది. వెంటనే కిందికి దిగి నైట్ డ్యూటీ డాక్టరుతో తిరిగి వచ్చింది,

"నిద్రపోకుండా ఇలాగే కూర్చున్నారా రాత్రంతా" అంటూ వాళ్ళను పలకరించి, రోగి చెయ్యి పట్టుకుని నాడి చూశాడు. స్టెతస్కోపుతో గుండె పరీక్ష చేశాడు.

అతడి ముఖం వాలిపోయినట్లయింది. గబగబా ట్యూబులన్నీ తీసివేశాడు. రోగికి ఆపాదమస్తకమూ దుప్పటి కప్పాడు

ఏమిటిది? పరీక్షచేసి ట్యూబులన్నీ తీసేశాడు. ఇంక వాటితో పని లేదా?

మెట్లవరకు వచ్చి రమణమ్మ డాక్టర్ని అడిగింది. "డాక్టరుగారూ ? బాబు రేపు కళ్ళు తెరుస్తాడా?" అని.

"అయిపోయిందమ్మా అంతా అయిపోయింది." గబగబా మెట్లు దిగాడు.

రమణమ్మ బొమ్మలా నిలబడిపోయింది. రోహిణి గోడకుమొఖాన్నానించింది.

వార్డు బాయ్ టాక్సీ తెచ్చాడు. ఆ రెండేళ్ళూ సాంబుకు వైద్యం చేసిన డాక్టర్లిద్దరూ, నర్సులూ వార్డుబాయిస్ అంతా వాళ్ళను ఓదార్చి టాక్సీ ఎక్కించారు.

కారులో కూర్చుని సాంబును తన ఒడిలో పడుకోబెట్టుకుని, అతడిదేహాన్ని చేత్తో నిమురుతూ "సాంబూ! నాతో కటీఫ్ చేసి వెళ్ళిపోతున్నావు. నీ కోపం తాటాకుల మంటని నాకు తెలుసులే. మళ్ళీ రావూ దోస్త్ ననుకుంటూ"

ఆమె కన్నీటితో అతడి పైన కప్పిన దుప్పటి తడిసిపోతూంది.

(ఆంధ్రప్రభ - సచిత్ర వార పత్రిక)